క్లుప్తంగా

విస్తృత ప్రచారం



కొడవలూరు: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో మండలంలోని గుండాలమ్మపాళెం, బసవాయపాళెం, వెంకన్నపురం, నార్తురాజుపాళెంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగద్గీత గ్రంథాలపై విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు డి.సురమౌళి, సభ్యులు లీలావతి, మోహన్, కృష్ణ, మనోజ, సుందర్‌రాజా, కావ్యశ్రీ, వేణు, వెంకటేశ్వర్లు, శ్రీదేవి, పద్మజ, సుమలత తదితరులు పాల్గొన్నారు.

భయం భయంగా..



ప్రమాదకర మలుపు

పొదలకూరు: పొదలకూరు – కలువాయి మార్గం లింగంపల్లితోపునకు సమీపంలో ఉన్న మలుపంటే వాహనచోదకులు భయపడుతున్నారు. ఈ మార్గంలో కొత్తగా వాహనం నడిపేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. మలుపు మీదుగా వెళ్లే సమయంలో ఎదురుగా వచ్చే వాహనం సరిగా కనిపించకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అయితే ఆర్‌అండ్‌బీ అధికారులు ఈ మలుపు వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడం లేదు. పదేళ్లగా పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగినా సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై విమర్శలున్నాయి. నిత్యం రద్దీగా ఉండే మార్గంలో ఇకనైనా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాల్సిందిగా వాహనచోదకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కోడూరు బీచ్‌లో పర్యాటకుల సందడి

తోటపల్లిగూడూరు: ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కోడూరు బీచ్ ఆదివారం పర్యాటకులతో కోలాహలంగా మారింది. పిల్లలు, యువత గంటల కొద్ది సముద్ర స్నానాలతో ఉత్సాహంగా గడిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన సందర్శకుల రాకపోకలు సాయంత్రం 6 గంటల వరకు కొనసాగాయి.

ఆలయాల్లో ఆధ్యాత్మిక సేవలు



ఆలయం వద్ద ప్రణవపీఠ శిష్య బృందం సభ్యులు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో నెల్లూరుకు చెందిన ప్రణవపీఠ శిష్య బృందం వారు గుడి – బడి అనే కార్యక్రమంలో పరిశుభ్రత కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు మాట్లాడుతూ ప్రణవపీఠ శిష్య బృందం వారు ప్రతి నెలా జిల్లాలోని రెండు పురాతన ఆలయాల్లో పరిశుభ్రత పనులు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఓ వెంకటేశ్వర్లు, పాలకమండలి సభ్యులు రఘురామయ్య, కామేశ్వరమ్మ పాల్గొన్నారు.

నగల పర్సు చోరీ

నెల్లూరు(క్రైమ్): బస్సెక్కే సమయంలో నగల పర్సు చోరీకి గురైన ఘటనపై నవాబుపేట పోలీసులు కేసును ఆదివారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఊటుకూరుకు చెందిన షాజహాని నగరంలోని తన కుమార్తె ఇంటికి ఈ నెల ఏడున వచ్చారు. తిరిగి ఇంటికెళ్లేందుకు గానూ ఆత్మకూరు బస్టాండ్‌కు వచ్చారు. బస్సెక్కే క్రమంలో ఆమె వద్ద గల నగల పర్సు అపహరణకు గురైంది. అందులో మూడు సవర్ల బంగారు ఆభరణాలున్నాయి. ఇంటికెళ్లాక చూసుకున్న ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. పర్సు కోసం వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హోరాహోరీగా జూడో పోటీలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కొండాయపాళెంలోని ఇన్‌ఫెంట్ జీసస్ స్కూల్ క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి మహిళలు, పురుషుల సీనియర్ జూడో చాంపియన్‌షిప్‌లో క్రీడాకారులు ఆదివారం హోరాహోరీగా తలపడ్డారు. 44 నుంచి 100 కిలోల విభాగాల్లో పోటీలను నిర్వహించారు. ఫైనల్స్, బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నామని జూడో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆనం రామకిషోర్‌రెడ్డి తెలిపారు. జూడో అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ ఆనం రంగమయూర్‌రెడ్డి, జాతీయ కోశాధికారి కైలాష్ యాదవ్, రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ రాంబాబు, సీఈఓ బాబు, రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి కిరణ్‌కుమార్, జిల్లా అసోసియేషన్ కోశాధికారి వెంకట్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనం మహేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



రెండో స్థానంలో నిలిచిన విజయనగరం బాలుర జట్టు



రెండో స్థానంలో నిలిచిన కృష్ణా జిల్లా బాలికల జట్టు

ఉత్సాహంగా క్రీడా పోటీలు

రెండురోజులుగా మండల కేంద్రమైన బుచ్చిరెడ్డిపాళెంలోని డీఎల్ఎన్ఆర్ పాఠశాల ఆవరణలో జరుగుతున్న రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. రాష్ట్ర వ్యాప్తంగా 25 జూనియర్ బాలబాలికల జట్లు ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నాయి. విజేతలుగా నిలిచిన వారికి చీర్ల ప్రసాద్ యాదవ్ యువసేన వారు బహుమతులు అందజేశారు.

– బుచ్చిరెడ్డిపాళెం



మూడో స్థానంలో నిలిచిన నెల్లూరు బాలుర జట్టు



మూడో స్థానంలో నిలిచిన చిత్తూరు బాలికల జట్టు



బహుమతుల ప్రదానం కార్యక్రమంలో పాల్గొన్న వివిధ జిల్లాల క్రీడాకారులు



అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పరుశురాముడుకు జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

ఊరెళ్లాలంటే..

- కొన్ని గ్రామాలకు ఆటోల ప్రయాణమే..
- ఆర్టీసీ బస్సుల కోసం వినతి



పొదలకూరు బస్టాండ్‌లో ఆటోలు

పొదలకూరు: ఆటో డ్రైవర్లు కనికరిస్తేనే ఆ మార్గంలో ఊరెళ్లేందుకు వీలవుతుంది. లేకుంటే గంటల తరబడి నిరీక్షణ చేయాల్సిందే. ప్రతినిత్యం గ్రామాల నుంచి మండల కేంద్రానికి పనులపై రావాలంటే ఆటోలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు సకాలంలో గమ్యస్థానాలకు చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో అవి కూడా అందుబాటులో లేక ప్రయాణాలనే మానుకుంటున్నారు. ఈ తంతు కొద్ది సంవత్సరాలుగా ఉంది. ఆర్టీసీ బస్సు పాఠశాలల పనిదినాల్లోనే గ్రామాలకు వెళ్తుంది. మిగిలిన రోజుల్లో ప్రజలు ప్రమాదకరమైన ఆటోలనే ఆశ్రయించాలి.

మండలంలోని పొదలకూరు – నావూరు మార్గంలో ఉన్న గ్రామాల ప్రజలు సరైన రవాణా సౌకర్యం సక్రమంగా లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ దారిలో వరుసగా భోగసముద్రం వరకు అయ్యగారిపాళెం, నందివాయ, అమ్మవారిపాళెం, నావూరుపల్లి, నావూరు, చెన్నారెడ్డిపల్లి, భోగసముద్రం గ్రామాలున్నాయి. ఎప్పుడు ఆటోలు కిటకిటలాడుతూనే ఉంటాయి. పొదలకూరు నుంచి భోగసముద్రం వరకు 20 కి.మీ దూరం ఉంది.

ఏడు గ్రామాలకు ఒక్కటే..

ప్రయాణికులు ఆటోలు ఎక్కుతున్నారని ఆర్టీసీ అధికారులు బస్సులను భోగసముద్రం మార్గంలో పంపడం లేదు. అయితే ప్రభగిరిపట్నం మార్గంలో భోగసముద్రంకు రోజుకు రెండు పర్యాయాలు ఒక్క బస్సునే పంపుతున్నారు. దీంతో అనువైన సమయాల్లో బస్సు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతూ అనేకమంది ఆటోలను ఆశ్రయిస్తున్నారు. పొదలకూరులో ఆటోలు కిటకిటలాడేంత వరకు తీసే పరిస్థితి ఉండదు. ఫలితంగా గంటల తరబడి భోగసముద్రం మార్గంలో ప్రయాణికులు వేచి ఉండాల్సి వస్తోంది. అంతేకాక ఆటో డ్రైవర్లు ఎక్కువ మందిని ఎక్కించుకుని ప్రమాదకరమైన పరిస్థితుల్లో తరలిస్తున్నారు. కాగా మలుపుల మార్గంలో ప్రమాదాలు సంభవిస్తాయని చాలామంది భయపడుతూ ప్రయాణిస్తున్నారు.

బస్సుల సంఖ్య పెంచాలి

పొదలకూరు – నావూరు, చేజర్ల మండలం పాతపాడు మీదుగా బస్సు సర్వీసును నడిపితే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది. ఇందువల్ల బస్సు సర్వీసును పెంచినట్లుగా కూడా ఉంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. విధి లేని పరిస్థితుల్లోనే ప్రయాణికులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఈ మార్గంలో కనీసం రెండు బస్సు సర్వీసులను నడిపితే ఉపయోగకరంగా ఉంటుంది. అంతేకాక ఆర్టీసీకి ఆదాయం కూడా వస్తుందని చెబుతున్నారు.

గంటల తరబడి నిరీక్షిస్తున్నాం



మా గ్రామం నుంచి పొదలకూరుకు వెళ్లాలంటే ఆటోల కోసం గంటల తరబడి నిరీక్షిస్తున్నాం. కొన్ని సందర్భాల్లో వేచి ఉండలేక ప్రయాణాలను మానుకోవాల్సి వస్తోంది. అత్యవసర సమయాల్లో ప్రత్యేకంగా ఆటోలకు బాడుగ చెల్లించి వెళ్లాల్సి వస్తోంది.

– వి.మాలకొండారెడ్డి, చెన్నారెడ్డిపల్లి

అంగన్‌వాడీలకు కుర్చీల వితరణ



చీర పంపిణీ చేస్తున్న వెంకటశేషయ్య

వెంకటాచలం: మండలంలోని కురిచెర్లపాడులోని మూడు అంగన్‌వాడీ కేంద్రాలకు మాజీ ఎంపీటీసీ యర్రబల్లి శ్రీనివాసులు, వీరేపల్లి రామచంద్రనాయుడు ఆర్థిక సహకారంతో ఆదివారం 40 కుర్చీలను పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య చేతుల మీదుగా వాటిని పంపిణీ చేశారు. అలాగే గ్రామంలోని పలువురు ఎస్సీలకు చీరలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రభావతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు సుమతి, షబానా, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి కాకాణి రాక

వెంకటాచలం: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం వెంకటాచలంలో పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు వెంకటాచలంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో రెవెన్యూ సమస్యలపై అర్జీలు స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తెలియజేశారు.

మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.12 వేలు

కొడవలూరు: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాలనీల్లో ఇంటి నిర్మాణ లబ్ధిదారులు మరుగుదొడ్డి నిర్మించుకుంటే అదనంగా గృహ నిర్మాణ శాఖ ద్వారా రూ.12 వేలు ఇస్తారని హౌసింగ్ ఏఈ పి.సురేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటి నిర్మాణానికి ఇచ్చే రూ.1.80 లక్షలతోపాటు అదనంగా రూ.12 వేలు చెల్లిస్తామన్నారు. అయితే మరుగుదొడ్డి నిర్మాణం ఇంటి మెట్ల కింద కాకుండా బయట చేపట్టాలన్నారు. అదేవిధంగా ఇంట్లోని వృథా నీరు రోడ్లపైకి వదలకుండా సోక్ పిట్ నిర్మాణం చేసుకుంటే అదనంగా రూ.6 వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. కేవలం మూడు వరలతో సోక్ పిట్ నిర్మించుకున్నా రూ.6 వేలు చెల్లిస్తామన్నారు. గృహ నిర్మాణ లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బాధితుడికి భరోసా



లక్ష్మయ్యకు నగదు అందజేస్తున్న దృశ్యం

బుచ్చిరెడ్డిపాళెం: ఇటీవల ఇస్కపాళెం గ్రామానికి చెందిన ఉప్పాల లక్ష్మయ్య కల్లు గీస్తూ చెట్టుపై నుంచి పడి గాయపడగా అతడిని ఆదివారం జిల్లా గౌడ్ సంఘం అధ్యక్షుడు తోట ప్రభాకర్ గౌడ్ పరామర్శించారు. రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచానికే పరిమితమైన లక్ష్మయ్యకు జిల్లా కల్లుగీత పారిశ్రామికుల సంఘం మరియు గౌడ్ సేవా సమితి ట్రస్ట్ వ్యవస్థాపకుడు దివంగత కోరుసూరు గోవిందయ్య ఆశయ సాధనలో భాగంగా నగదు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పెంచలయ్య, చిన్న గోవింద్, హజరత్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

చిన్నారులకు అండగా సర్పంచ్

- 11 మందికి రూ.1.13 లక్షల అందజేత



నగదు అందజేస్తున్న సర్పంచ్ శ్రీనివాసులు

కొడవలూరు: మండలంలోని రేగడిచెలికలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు గ్రామ సర్పంచ్ నల్లావుల శ్రీనివాసులు ఆర్థిక సాయమందించారు. తల్లి లేదా తండ్రిని కోల్పోయిన 8 మంది చిన్నారులకు రూ.10 వేల వంతున ఇవ్వడంతోపాటు తల్లిదండ్రులిద్దర్నీ కోల్పోయిన ముగ్గురికి రూ.11 వేల వంతున రూ.1.13 లక్షల సొంత నిధులను సాయమందిచారు. ఈ మొత్తాన్ని గ్రామ సచివాలయంలో సర్పంచ్ శ్రీనివాసులు చేతుల మీదుగా ఆదివారం చిన్నారులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు సామాజిక బాధ్యతతో తనవంతు భరోసా కల్పించడం జరిగిందన్నారు. భవిష్యత్‌లో వారికి మరింత సాయపడడంతోపాటు ఇలాంటి చిన్నారులందరికీ అండగా ఉంటానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తలమంచి సొసైటీ అధ్యక్షుడు దేవనబోయిన శివకుమార్, ఉప సర్పంచ్ తక్కెళ్లపాటి కళాకృష్ణ, పంచాయతీ కార్యదర్శి ఎస్.విజయకుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు మోటుపల్లి వెంకటేశ్వర్లు, తోడేటి సుబ్బారావు, మందాడి వెంకటేశ్వర్లు, నగళ్ల లింగయ్య, కట్టా పుల్లయ్య పాల్గొన్నారు.

మౌన ప్రదర్శన



మౌన ప్రదర్శన చేస్తున్న క్రైస్తవులు

పొదలకూరు: మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులను ఖండిస్తూ పొదలకూరు పట్టణంలో ఆదివారం జాన్ జాకబ్ లూథరన్ చర్చి సమాఖ్య వేదిక ఆధ్వర్యంలో మౌన ప్రదర్శన జరిగింది. సేవ్ మణిపూర్ అంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. దాడులు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ పాల్‌మహేంద్ర చర్చి సమాఖ్య వేదిక బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయంలో పొంగళ్లు



ఆలయం వద్ద పొంగళ్లతో మహిళలు

వెంకటాచలం: మండలంలోని సర్వేపల్లి గ్రామం యాదవ వీధిలో ఉన్న గంగమ్మ ఆలయం వద్ద ఆదివారం యాదవ మిత్ర మండలి ఆధ్వర్యంలో పొంగళ్లు పెట్టారు. ఈ సందర్భంగా తప్పెట్లతో చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. మహిళలు ఆలయం వద్ద పూజలు చేసి పొంగళ్లు పెట్టారు.

పారా స్పోర్ట్స్ క్రీడాకారులకు సాయం



క్రీడాకారులను అభినందిస్తున్న కళ్యాణ్‌కుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట: పారా స్పోర్ట్స్ క్రీడాకారులకు వైఎస్సార్‌సీపీ నాయకుడు దువ్వూరు కళ్యాణ్‌కుమార్‌రెడ్డి రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. ఉమ్మడి జిల్లాకు చెందిన పారా స్పోర్ట్స్ క్రీడాకారులు ఈనెల 15 తేదీన విశాఖపట్నం రైల్వే ఇండోర్ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పారా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో కళ్యాణ్‌కుమార్‌రెడ్డిని నెల్లూరులోని నివాసంలో ఆదివారం క్రీడాకారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారిని అభినందించి నగదు చేశారు. పోటీల్లో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు.

కుడితిపాళెంలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ఇందుకూరుపేట: ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలంలోని కుడితిపాళెం గ్రామంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇందులో 59 మంది యువత రక్తదానం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ యూత్ సెక్రటరీ ప్రసాద్ మాట్లాడుతూ 27వసారి ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నరసాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల పీఈటీ ఎస్కే ముజీర్, సర్పంచ్ నాయుడు సురేష్, రాం సుబ్బారెడ్డి, ఇబాదుల్లా, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేలటూరుకు సౌర వెలుగులు

- సీఎస్సార్ నిధులతో ఏర్పాటు



నేలటూరు దళితవాడలో..

ముత్తుకూరు: మండలంలోని నేలటూరు పంచాయతీకి కొత్త కళ వచ్చింది. గ్రామస్తుల కోరిక మేరకు ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ సంస్థ సామాజిక బాధ్యత నిధులతో ప్రధాన వీధుల్లో స్తంభాలను ఏర్పాటు చేసి సౌర విద్యుత్ దీపాలను అమర్చింది. పాళెం నుంచి క్రీక్ వరకు ఒక వరుస, దళితవాడ ప్రధాన వీధిలో మరో వరుస మాడ్యుల్స్‌తో కూడిన ఆరు మీటర్ల ఎత్తైన స్తంభాలను ఏర్పాటు చేశారు. అలాగే గ్రామ ప్రధాన కూడలిలో ఒక పెద్ద స్తంభాన్ని అమర్చారు. ఈ విధంగా సుమారు రూ.16.40 లక్షల వ్యయంతో 70 స్తంభాలను ఏర్పాటు చేశారు. పంచాయతీ నిర్వాహకులకు అప్పగించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం, విద్యుత్ తీగలు తెగిపోవడం వంటి సమస్యలకు తావు లేదు. ఈ సౌకర్యం వల్ల పంచాయతీకి నెలకు రూ.5,000 మేరకు విద్యుత్ బిల్లు ఆదా అవుతుందని ప్రాజెక్ట్ ఇంజినీర్లు వెల్లడించారు.

ఫోన్ పోయిందా.. చింతొద్దు

- కోటమిట్టకు చెందిన బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి షఫీ మొబైల్ ఫోన్ ఇటీవల పోయింది. కేంద్ర టెలికమ్యూనికేషన్స్ మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టిన సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) పోర్టల్లో ఫిర్యాదు చేశారు. పోగొట్టుకున్న మొబైల్‌ను సాంకేతికత ద్వారా రోజుల వ్యవధిలోనే పోలీసులు గుర్తించి బాధితుడికి అప్పగించారు.
- నగరానికి చెందిన గోపాల్ తన ఐ ఫోన్‌ను పోగొట్టుకున్నారు. ఆయన సైతం సీఈఐఆర్ పోర్టల్లో ఫిర్యాదు చేశారు. రోజుల వ్యవధిలోనే ఫోన్‌ను పోలీసులు గుర్తించి బాధితుడి చెంతకు చేర్చారు.



కోటమిట్టకు చెందిన షఫీకి ఫోన్‌ను అందజేస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి (ఫైల్)

- అందుబాటులో సీఈఐఆర్ సేవలు
- మొబైల్ హంట్ ద్వారా బాధితులకు సెల్‌ఫోన్ల అందజేత

నెల్లూరు(క్రైమ్): ప్రస్తుత జీవనశైలిలో సెల్‌ఫోన్ అత్యంత కీలకమైంది. సమాచారం తెలుసుకోవాలన్నా.. నగదు చెల్లింపులు జరపాలన్నా.. ఏదైనా దరఖాస్తు చేసుకోవాలన్నా దీనిపైనే ఆధారపడుతున్నాం. ఇంతటి ప్రాధాన్యం సంతరించుకున్న సెల్‌ఫోన్ చోరీకి గురైనా.. పోయినా పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించనవసరం లేదు. పోయిన ఫోన్లను వెతికేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం మొబైల్ హంట్ సేవలను ఇప్పటికే అందుబాటులోకి తీసుకొచ్చింది. 91543 05600 నంబర్‌కు వాట్సాప్ చేస్తే మెసేజ్ వస్తుంది. లింక్‌ను ఓపెన్ చేసి వివరాలను అప్‌లోడ్ చేయాలి. సాంకేతిక పరిజ్ఞానంతో మొబైల్‌ను పోలీసులు ట్రేస్ చేసి అప్పగిస్తున్నారు.

664 మొబైల్ ఫోన్ల రికవరీ

ఇప్పటి వరకు రూ.1.6 కోట్ల విలువజేసే 664 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన సీఈఐఆర్ విధానం దీనికి మరింత చేయూతనిస్తోంది. దీని ద్వారా సెల్‌ఫోన్‌ను త్వరితగతిన గుర్తించే అవకాశంతో పాటు ఫోన్లలో నిక్షిప్తమైన వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం కాకుండా బ్లాక్ చేయొచ్చు. ఈ సేవలను వినియోగించుకోవాలని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి కోరారు.

సీఈఐఆర్‌లో నమోదు ఇలా..

- మొబైల్‌ను పోగొట్టుకున్న బాధితులు తొలుత స్థానిక పోలీస్‌స్టేషన్లో వివరాలివ్వాలి.
- అనంతరం సీఈఐఆర్ (www.ceir.gov.in) వెబ్‌సైట్‌లో లాగిన్ కావాలి. అందులో రిక్వెస్ట్ ఫర్ బ్లాకింగ్ లాస్ట్ / స్టోలెన్ మొబైల్ లింక్‌పై క్లిక్ చేయాలి. పోయిన సెల్‌ఫోన్లోని నంబర్, ఐఎంఈఐ, కంపెనీ పేరు, మోడల్, మొబైల్ కొనుగోలుకు సంబంధించిన బిల్లును అప్‌లోడ్ చేయాలి.
- మొబైల్ ఏ రోజు.. ఎక్కడ పోయింది, ఏ రాష్ట్రం, జిల్లా, ఏ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు, తదితర వివరాలను నమోదు చేయాలి.
- పోగొట్టుకున్న నంబర్‌పై సిమ్ కార్డును మరోసారి పొందాలి. ఈ నంబర్‌కు కంప్లయింట్ ఓటీపీ వస్తుంది
- పోలీస్‌స్టేషన్లో ఇచ్చిన కంప్లయింట్ కాపీని పోర్టల్లో అప్‌లోడ్ చేయాలి.
- చివరగా వినియోగదారుడి పేరు, చిరునామా, గుర్తింపు కార్డు (ఆధార్, పాన్, ఓటర్ ఐడీ, తదితర ప్రభుత్వ గుర్తింపు పొందినవి), ఈ – మెయిల్ ఐడీని నమోదు చేయాలి.
- ప్రక్రియ పూర్తయిన అనంతరం ఐడీ నంబర్ వస్తుంది. సంబంధిత ఐడీ ఆధారంగా దర్యాప్తు ప్రక్రియతో పాటు మొబైల్ దొరికిన వివరాలను తెలుసుకోవచ్చు
- మొబైల్ ఏ కంపెనీదైనా సీఈఐఆర్ విధానం దాన్ని పనిచేయకుండా చేస్తుంది. దీంతో పాటు కేసు ఛేదనలో జిల్లా పోలీసులకు ఉపయోగపడుతుంది.
- సెల్‌ఫోన్ లభ్యమైన అనంతరం బాధితుడు అదే వెబ్‌సైట్‌లోకి వెళ్లి అన్‌బ్లాక్ / ఫౌండ్ మొబైల్ అనే లింక్‌పై క్లిక్ చేయాలి. ఐడీ నమోదు చేయగానే ఫోన్ అన్‌బ్లాక్ అవుతుంది.
- కేంద్రం ప్రవేశపెట్టిన సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో పూర్తి సమాచారాన్ని నమోదు చేస్తే త్వరగా దొరికేందుకు అవకాశం ఉంటుంది.



సీఈఐఆర్ వెబ్‌సైట్